క్లుప్తంగా

వరిలో మొలక నివారణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు: ఎడగారులో వర్షాలు కురుస్తుండటంతో ధాన్యం మొలకెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ కుమార్ రైతులను కోరారు. 'నేలకొరిగిన వరి' శీర్షికన ఆదివారం 'సాక్షి' దిన పత్రికలో కథనం ప్రచురితం కావడంతో ఏఓ స్పందించారు. గునపాడు, మెట్టు గ్రామాల్లో పర్యటించి రైతులకు ధాన్యం గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు తగు సూచనలు అందజేశారు. ముందుగా పొలంలోని నీటిని బయటకు వదిలివేయాలన్నారు. వరి కోతకు వచ్చినప్పుడు వర్షాలు పడుతుంటే ఎన్ను(కంకు) మీద 1లీటర్ నీటిలో 50 గ్రాములు ఉప్పు కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఇలా చేసుకోవడం వల్ల 15 రోజుల వరకు వరి గింజలు మొలకెత్తకుండా ఉంటాయని, గింజలు రంగు మారకుండా ఉంటాయని తెలిపారు. ఒక వేళ వరి కోసి రాశుల మీదవడ్లు తడిసి ఉన్నట్లయితే 100 కిలోల వడ్లకు 1 కేజీ ఉప్పుతో 4 కేజీల ఊక, చిన్న చిన్న ముక్కలుగా చేసిన వరి గడ్డిని కలిపి కుప్పలుగా పోసి వారం రోజుల తర్వాత ఎండ బెట్టుకోవాలని తెలియజేశారు.

తాళ్లమ్మతల్లి కొలుపు



ఊరేగింపులో దేవతామూర్తులు

దక్కిలి: మండలంలోని దగ్గవోలు గ్రామంలో తాళ్లమ్మతల్లి కొలుపు మహోత్సవం శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు అత్యంత వైభవంగా సాగింది. రెండేళ్ల కిందట గ్రామంలో నూతనంగా అమ్మవారి ఆలయాన్ని నిర్మించారు. మూడేళ్లపాటు క్రమం తప్పకుండా కొలుపు వేడుకలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి అమ్మవారు తాళ్లమ్మతల్లి, పోతురాజు, పరశురామయ్యతో పాటు పలువురు దేవతలను గ్రామ చావడి వద్ద కొలువుదీర్చారు. అనంతరం మేళ తాళాలతో ఊరేగించారు. గొల్లలు వేసిన వీర తాళ్లు ఆకట్టుకున్నాయి. ఆదివారం సాయంత్రం గ్రామస్తులు తాళ్లమ్మతల్లికి సామూహిక పొంగళ్ల కార్యక్రమం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ



ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

కలువాయి(సైదాపురం): మండలంలోని కేసీ గోపవరం గ్రామంలో అభయ ఆంజనేయ స్వామి నూతన విగ్రహావిష్కరణ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు హోమాలు నిర్వహించి విగ్రహావిష్కరణ చేపట్టారు. గ్రామస్తులందరూ కలసికట్టుగా పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

ఉచిత వైద్య శిబిరం

కలువాయి(సైదాపురం): కలువాయి బీవీఎన్ఆర్ జెడ్పీ హైస్కూల్లో నెల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరు లయన్స్ క్లబ్ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కంటి, నరాల, పళ్ల సంబంధించి ఉచితంగా మెడికల్ క్యాంప్ నిర్వహించినట్లు నెల్లూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీధర్ తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ భావన, కంటి, చెవుల సంబంధించి డాక్టర్ రాహుల్ 110 మందికి ఉచితంగా పరీక్షలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నెల్లూరు లయన్స్ క్లబ్ సెక్రటరీ రామకృష్ణ, ట్రెజరర్ వెంకటేశ్వర్లు, క్యాంప్ ఇన్‌చార్జి ఆంజనేయులు, కలువాయి వాసవీ క్లబ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న నిర్వాహకులు

దక్కిలి: మండలంలోని దేవల వడ్డిపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. కన్నయ్య ప్రతిమను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆదివారం అంగరంగ వైభవంగా గ్రామోత్సవం, శ్రీకృష్ణ నృత్యాలతో వేడుకగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

చికెన్ ధరలు 18-8-2025

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ లైవ్	:	123
లేయర్ లైవ్	:	118
బ్రాయిలర్ చికెన్	:	224
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	250
లేయర్ చికెన్	:	200

చెరువులు కావు రోడ్లు



చిట్టమూరు: చెరువును తలపిస్తున్న రోడ్డు

ఓజిలి: కురుగొండలో వర్షపు నీటితో నిండిన రహదారి



పెళ్లకూరు: అధ్వాన్నంగా మారిన కప్పగుంటకండ్రిగ రోడ్డు





చిట్టమూరు: బురదగుంటగా మారిన రోడ్డు



ఓజిలి: బత్తలాపురంవద్ద గుంతలు పడిన రోడ్డు



ఓజిలి సమీపంలో గుంతల రోడ్డు

చిట్టమూరు: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోట–నాయుడుపేట రహదారి చెరువులా మారింది. మండలంలో మెట్టు, గునపాడు, గునపాటిపాళెం గ్రామాల మీదుగా వెళ్లే రహదారి ధ్వంసమైంది. రోడ్డుపై గోతులు, కోతకు గురైన రోడ్డు మార్జిన్, ఎక్కడ చూసినా పైకి తేలిన కంకరతో వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ రహదారి కోట, చిట్టమూరు, వాకాడు, నాయుడుపేట మండలాలను కలుపుతూ సుమారు 30 కిలోమీటర్ల మేర 35 గ్రామాలకు రాకపోకలకు ఇదే మార్గం. రోడ్డుపై ఎంత లోతులో నీరు ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అయినా పట్టించుకునే వారేలేరు.

చినుకులకే రోడ్లు చిత్తడి

పెళ్లకూరు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు వీధులు, రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. మండలంలోని చెంబేడు, తాళ్వాయిపాడు, కానూరు, రోసనూరు, పాలచ్చూరు, చెన్నప్పనాయుడుపేట తదితర గ్రామాల్లోని వీధులన్నీ బురమయంగా మారాయి. గ్రావెల్ రోడ్లన్నీ బురదగుంటలుగా మారాయి. కప్పగుంటకండ్రిగ, నందిమాల, యడపూడి, యాలకారికండ్రిగ, గంగరాజుకండ్రిగ తదితర ప్రాంతాలకు వెళ్లే గ్రావెల్ రోడ్లపై ప్రయాణించలేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



కోట: విద్యానగర్ మెయిన్‌రోడ్డులో ప్రమాదకరంగా గుంత

గుంతల రోడ్లతో అవస్థలు

కోట: మండలంలోని విద్యానగర్ నుంచి గూడలి వరకు ప్రధాన రహదారి గుంతలమయంగా మారి భయపెడుతోంది. ఇదే రహదారిపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుపై గుంతలు పెద్దవిగా ఉండడం చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి వాహనదారులకు లోతు తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు.

బురద గుంటల్లో ప్రయాణం

ఓజిలి: మండల పరిధిలోని ఓజిలి నుంచి కురుగొండ గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి 9 కిలోమీటర్లు బురదగుంటలుగా మారింది. రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బత్తలాపురం, మానమాల, కురుగొండ గ్రామాల వద్ద రోడ్డు పూర్తిగా గుంతలు పడి అందులో నీరు నిలిచిపోయింది. పాదచారులు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ చిన్నరాయుడు మాట్లాడుతూ, రోడ్డు మరమ్మతులకు రూ.40లక్షలతో ప్రతిపాదనలు పంపామని, అనుమతులు రాగానే పనులు చేపడతామని చెప్పారు.

గోపియాదవ్ మృతి తీరని లోటు



గోపియాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

చిల్లకూరు: గూడూరు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు బట్టా గోపియాదవ్ అకస్మాత్తుగా మృతి చెందడం పార్టీకి తీరని లోటని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గం సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. బట్టా గోపి యాదవ్ ఆదివారం హఠాత్తుగా గుండెపోటుతో ఆస్పత్రిలో చేరి, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆసుపత్రి వద్దకు చేరుకుని భౌతిక కాయాన్ని సందర్శించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు.

పేద కుటుంబాలకు సరుకుల పంపిణీ



సరుకులు అందిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఆదివారం పేద కుటుంబాలకు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నెలకు సరిపడా ఫల సరుకులు పంపిణీ చేశారు. విక్రమ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా పేదలకు ఫల సరుకులు అందిస్తున్నట్లు వివరించారు. ఈ క్రమంలో గూడూరు పట్టణంలోని ప్రముఖ వైద్యులు జనార్దనరెడ్డి, రోహిణి దాతృత్వంతో డాక్టర్ సీఆర్ రెడ్డి జ్ఞాపకార్థం 20 మంది పేద కుటుంబాల వారికి ఫల సరుకులు అందించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, దువ్వూరు విజయ భాస్కర్‌రెడ్డి కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల వద్ద కార్డన్ సెర్చ్



వాహనాలను సీజ్ చేసిన పోలీసులు

వెంకటగిరి రూరల్: పట్టణంలోని జగనన్న కాలనీ సమీపంలో ఉన్న టిడ్కో గృహాల వద్ద ఆదివారం సీఐ ఏవీ రమణ ఆధ్వర్యంలో కార్డన్‌సర్చ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలను నిర్మూలించేందుకు పట్టణంలోని పలు ప్రదేశాల్లో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా టిడ్కో గృహాల వద్ద సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. ఈ మేరకు ఎలాంటి పత్రాలు లేని 5 స్కూటర్లు, 3 ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ఏడుకొండలు, శివశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చవితి వేడుకల్లో పోటీతత్వం వద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ గీతాకుమారి

చిల్లకూరు : గూడూరు డివిజన్ సర్కిల్ పరిధిలో వినాయక చవితి వేడుకలను భక్తి భావంతో నిర్వహించుకోవాలే తప్ప పోటీతత్వంతో భారీ విగ్రహాలు, డీజేలు, బారీ బాణసంచాలకు దూరంగా ఉండాలని గూడూరు డీఎస్పీ గీతాకుమారి సూచించారు. ఆదివారం గూడూరు పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన వినాయక చవితి వేడుకల నిర్వాహకులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాలకు చెందిన వారు చందాలు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోందని అలాంటి వారిపై గట్టి నిఘా ఏర్పాటుచేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కండలేరులో 28 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 28.230 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 6840 క్యూసెక్కుల నీరు చేరుతుందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1750, పిన్నేరుకు 30, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్ కాలువకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పింఛన్లకు సర్కారు కత్తెర

- అనారోగ్యం, దివ్యాంగులకు కోత
- అల్లాడిపోతున్న లబ్ధిదారులు



ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)



నెల్లూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

దొరవారిసత్రం : గత ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా తీసుకుని వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద వివిధ కేటగిరిల్లో పింఛన్లను కేటాయించి దివ్యాంగులను, అనారోగ్యంతో మంచం పట్టిన వారికి వలంటీర్ల ద్వారా పింఛన్ నగదు అందించిన ఘనత జగనన్నకే దక్కింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కుంటి సాకులు చూపుతూ ప్రతి మండలంలో వందలాది మంది దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్న లబ్ధిదారుల పింఛన్లను రద్దు చేసింది. దీంతో లబ్ధిదారుల ఆక్రందన అంతా ఇంతా కాదు.

కుంటి సాకులతో తొలగింపులు

సూళ్లూరుపేట నియోజక వర్గంలోని ఆరు మండలాలతో పాటు నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణ ప్రాంతాల్లో కలిసి మొత్తం 764 మంది దివ్యాంగులు, వివిధ అనారోగ్యంతో మంచం మీద ఉన్నవారి పింఛన్లను తొలగించారు. మరి కొందరికి అయితే పర్సంటేజీ(దివ్యాంగులు) తక్కువగా ఉందనే సాకుతో రూ.6 వేలు వస్తున్న పింఛన్‌ను రూ.4వేలుకు కుందించారు. అన్ని అర్హతలు ఉన్నా కూటమి ప్రభుత్వం ఎందుకు తమ పింఛన్లను తొలగించిదంటూ సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పింఛన్ కోల్పోయిన వందలాది మంది పింఛనుదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దొరవారిసత్రంలో 134, నాయుడుపేట 97, నాయుడుపేట అర్బన్ 50, ఓజిలి 91, పెళ్లకూరు 213, సూళ్లూరుపేట 44, సూళ్లూరుపేట అర్బన్ 17, తడలో 100 దివ్యాంగులను తొలగించారు.

లక్ష్మీనరసింహుడికి పూజలు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని అలిమిలి గ్రామ సమీపం వద్ద ఉన్న కనుమరాయి కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. పల్లకి సేవ, వేద మంత్రాలతో మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

చవితి వేడుకలకు అంకురార్పణ

నాయుడుపేటటౌన్: నాయుడుపేట పట్టణంలో పలు కూడళ్ల వద్ద చవితి వేడుకలకు ఆదివారం అంకురార్పణ పూజలు చేశారు. రాజగోపాలపురం 3వ వీధిలో యువత 37 ఏళ్లుగా ప్రత్యేక సెట్టింగులతో మండపాన్ని ఏర్పాటు చేసి చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ క్రమంలోనే అంకురార్పణ పూజలు చేశారు.

నేటి నుంచి ఆరాధనోత్సవాలు

చిట్టమూరు: మండల పరిధిలోని తంబుగారిపాళెం గ్రామంలో కొలువైన భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధనోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. వారం పాటు సాగే ఈ ఉత్సవాలకు ఉదయం గణపతి పూజతో అంకుర్పారణ చేయనున్నట్లు చెప్పారు.

అంకమ్మతల్లి కొలుపు

సైదాపురం: స్థానిక పంచాయతీ పరిధిలోని దాడిశెట్టిపల్లిలో అంకమ్మతల్లి కొలుపు ఆదివారం వైభవంగా ముగిసింది. గ్రామస్తులందరూ పొంగళ్లుపెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జేవీవీ సేవలు అభినందనీయం

చిల్లకూరు: జేవీవీ సంస్థ మూఢ నమ్మకాలపై అవగాహన కల్పిస్తూనే వివిధ రకాల సేవా కార్యక్రమాలను చేపట్టడం ఎంతో అభినందనీయమని గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం దివ్యాంగులకు కూరగాయలు పంపిణీ చేశారు.

వైభవంగా రాపూరమ్మ జాతర





అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, గ్రామోత్సవంలో దర్శనమిస్తున్న రాపూరమ్మ

రాపూరు: రాపూరమ్మ జాతర మూడవ రోజు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆదివారం గ్రామస్తులు అమ్మవారి ఆలయంలో పొంగళ్లుపెట్టి నైవేద్యం సమర్పించారు. జాతరకు భక్తులు అధికసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో రాపూరు పట్టణంలో సందడి నెలకొంది. రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ట్రాక్టర్‌లో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని వివిధరకాల పుష్పాలు ఆభరణాలతో అలంకరించి మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు.

దేవాలయాల్లో వరుస చోరీలు



వివరాలు నమోదు చేసుకుంటున్న పోలీసులు

కలువాయి(సైదాపురం): కలువాయి మండలం పెన్నబద్దెవోలు గ్రామంలోని మెయిన్, అరుంధతీయవాడ, రాములవారి దేవస్థానాలు, ఒక అంగన్‌వాడీ సెంటర్‌లో గత రాత్రి గుర్తు తెలియని దుండగులు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. పెన్న బద్దవోలు గ్రామంలో మెయిన్ సెంటర్ రామాలయంలో రూ.లక్ష విలువ చేసే రెండు మంగళసూత్రాలు, రెండు కాసులు, అంగన్‌వాడీ సెంటర్‌లో 210 కోడి గుడ్లు, 30 కిలోల బియ్యం, రెండు నూనె ప్యాకెట్లు దుండగులు చోరీ చేశారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ కోటయ్య ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

ఉత్సాహంగా ఉట్టి మహోత్సవం



చిల్లకూరు: శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆదివారం గూడూరు మండలం కనుమరాయ కొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద ఉట్టి మహోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

కోలాహలం..

నాయుడుపేటటౌన్ పట్టణంలోని రాజగోపుల పురం వీధిలో ఉన్న రామాలయం వద్ద ఉట్టి మహోత్సవ వేడుకలను యువత, మహిళలు, చిన్నారులు కోలాహలంగా నిర్వహించారు.

భవన నిర్మాణ కార్మికుల బోర్డును పునరుద్ధరించాలి

చిల్లకూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మిక బోర్డును పునరుద్ధరించాలని కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కత్తి రవి డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఆదివారం భవన నిర్మాణ కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖాధికారి శ్రీకాంత్ కార్మికులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. అనంతరం సీపీఐ నాయకులు రాష్ట్ర 28వ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు.



గుర్తింపు కార్డులు అందజేస్తున్న కార్మికశాఖాధికారి

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ వెలుగులు

- విద్యుత్ బిల్లుల ఆదాకు మార్గం
- ఇంటి పై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు
- సబ్సిడీ ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం



దక్కిలిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

దక్కిలి: ఆధునిక కాలంలో విద్యుత్ వినియోగం పెరిగిపోయింది. ప్రతి చిన్న పనికీ విద్యుత్ వినియోగం తప్పనిసరి. అయితే ప్రకృతి వనరులతో తయారు చేస్తున్న విద్యుత్‌తో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశముంది. దీనికి ప్రత్యామ్నాయంగా సోలార్ విద్యుత్ ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ పథకాన్ని తీసుకొచ్చింది. సాధారణ విద్యుత్‌తో బిల్లులు అధికంగా వస్తున్నాయి. వీటి నుంచి విముక్తి పొందేందుకు సోలార్ విద్యుత్ వినియోగించాలని కేంద్రం సూచిస్తుంది. ఏపీ విద్యుత్ పంపిణీ సంస్థ ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఇంటి పైకప్పు మీద సోలార్ పలకల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందజేస్తోంది. ముఖ్యంగా ఏసీలు, గీజర్లు వాడే వినియోగదారులకు ఈ సోలార్ పవర్ ఎంతో ఉపయోగకరం. ఈ పథకానికి బ్యాంకులు రుణాలు అందజేస్తున్నాయి. వినియోగదారుడు మూలధన వ్యయాన్ని తిరిగి ఆరేళ్లలో పొందేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు గ్రామాల్లో పర్యటించి సోలార్ ఏర్పాటుకు సుముఖంగా ఉన్నవారి పేర్లను నమోదు చేసుకుంటున్నారు. కొందరు బ్యాంకుల్లో రుణం తీసుకోవడానికి వెళితే బ్యాంకులు రుణం మంజూరు చేస్తున్నాయి.

సోలార్ విద్యుత్‌తో ప్రయోజనాలు

- విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది.
- ఇంటి పైకప్పు చల్లగా ఉంటుంది.
- వాడకానికి మించి ఉత్పత్తి చేస్తే మిగులు విద్యుత్‌ను అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చు.
- పర్యావరణాన్ని కాపాడడంలో భాగస్వాములు కావచ్చు.
- ఈ పథకం కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే.
- ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవడానికి 10 చదరపు మీటర్ల స్థలం అవసరం ఉంటుంది.

సోలార్ ఏర్పాటు ధరలు, సబ్సిడీ వివరాలు

సామర్థ్యం	ఖర్చు	సబ్సిడీ	యూనిట్లు ఉత్పత్తి
1కిలోవాట్	రూ.75వేలు	రూ.30వేలు	100
2కిలోవాట్	రూ.1.40లక్షలు	రూ.60వేలు	220
3కిలోవాట్	రూ.2.17లక్షలు	రూ.78వేలు	340
4కిలోవాట్	రూ.2.67లక్షలు	రూ.78వేలు	460

అవగాహన కల్పిస్తున్నాం



సోలార్ వల్లే కలిగే లాభాల గురించి గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. విద్యుత్ బిల్లు ఆదా కావడమే గాకుండా ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా బ్యాంకులు రుణాలు కూడా ఇస్తున్నాయి. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. దీంతో విద్యుత్ సమస్య అసలే ఉండదు. వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను డిస్కంలకు అమ్ముకొని సొమ్ము చేసుకునే వెసులుబాటు ఉంది. దాదాపు ఐదేళ్లలో పెట్టుబడి తిరిగొస్తుంది. ఆ తరువాత ఉచితంగా విద్యుత్ పొందినట్లే. – అశోక్, ట్రాన్స్‌కో ఏఈఈ, దక్కిలి